క్లుప్తంగా

రూ.40వేల కోట్లతో లిక్కర్ వ్యాపారం : ఆర్‌ఎస్పీ

మానవపాడు: ఎమ్మెల్సీ కవిత ఢిల్లీలో సుమారు రూ. 40వేల కోట్లతో లిక్కర్ వ్యాపారం చేస్తున్నారని, అందుకే రూ.100 కోట్లు ఇచ్చారని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. మండలంలోని చందూరు, పల్లెపాడు, నారాయణపురం గ్రామాల్లో మంగళవారం బహుజన రాజ్యాధికార యాత్రలో భాగంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అవినీతిని ప్రశ్నించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బీఎస్పీ అధికారంలోకి వస్తే ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి పేద విద్యార్థులకు మెరుగైన విద్య అందిస్తామన్నారు. రాష్ట్రంలో అవినీతి పాలనకు అడ్డుకట్ట వేయాలని కోరారు.

రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటాలి

మానవపాడు: హరితహారం కార్యక్రమంలో భాగంగా రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటాలని ఎంపీడీఓ రమణారావు సూచించారు. మండలంలోని నారాయణపురంలో మంగళవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ హరిత లక్ష్యం మేరకు అన్ని గ్రామపంచాయతీల్లో మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. గ్రామాలకు వెళ్లే రోడ్లకు ఇరువైపులా విరివిగా మొక్కలు నాటి పెంచాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

దాడులను అరికట్టాలి

అలంపూర్: మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులను అరికట్టాలని పలు సంఘాల నాయకులు కోరారు. క్రైస్తవ సంఘాలు, పాస్టర్ల ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణిపూర్‌లో ప్రజలకు రక్షణ కల్పించాలని, దాడుల్లో నిరాశ్రయులైన వారిని అన్నివిధాలా ఆదుకోవాలన్నారు. మహిళలపై దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు.

రాజకీయాలపైనే కేసీఆర్ దృష్టి

గద్వాల అర్బన్: రాష్ట్రంలో అధిక వర్షాలకు ఇళ్లు కూలిపోయి పేదలు బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తుండగా, కేసీఆర్ ప్రభుత్వం పట్టించుకోకుండా రాజకీయాలపైనే దృష్టి సారించడం సరికాదని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి షేక్షావలి ఆచారి అన్నారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 40మంది చనిపోయ్యారని, బాధిత కుటుంబాలను పరామర్శించడానికి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, మంత్రులకు సమయం దొరకడం లేదని విమర్శించారు. సీఎం కేసీఆర్‌కు మహారాష్ట్ర రాజకీయాలపై ఉన్న సమయం.. పాలనపై లేకుండాపోయిందని విమర్శించారు. సమావేశంలో ఇసాక్, బాబు, షేక్ జమాల్, కిఫాయత్, శ్రీకాంత్, నరేంద్ ఉన్నారు.

వేతన సవరణ సంప్రదింపులు చేపట్టాలి

గద్వాల అర్బన్: ఎల్‌ఐసీ ఉద్యోగులకు వేతన సవరణ బకాయి ఏర్పడి ఏడాది గడిచిందని, ఎల్‌ఐసీ మేనేజ్‌మెంట్ వేతన సవరణకు సంప్రదించాలని చేపట్టాలని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ అసోసియేషన్ గద్వాల బ్రాంచ్ కార్యదర్శి పంగి రంగరావు అన్నారు. మంగళవారం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఉద్యోగులు డెమోని స్ట్రేషన్‌కు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీ పెన్షన్ 30శాతానికి పెంచుతూ కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి నాలుగేళ్లు గడుస్తున్నా తుది నిర్ణయం ప్రకటించలేదన్నారు. నిలిపివేసిన అడిషనల్ క్యాజువల్ లీవ్‌లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సూరజ్, చంద్రశేఖర్, రంగయ్య, రాఘవేంద్ర, శివకుమార్, కిశోర్, బషీర్ పాల్గొన్నారు.

బడి స్థలంలో గుడి కట్టొద్దు

గట్టు: మండలంలోని ముచ్చోనిపల్లెలో పాఠశాలకు కేటాయించిన స్థలంలో గుడి నిర్మించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, గుడి నిర్మాణం ఆపాలని తీన్మార్ మల్లన్న టీం సభ్యులు కోరారు. ఈ మేరకు మంగళవారం డీఈఓ సిరాజుద్దీన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కోఆర్డినేటర్ కొమ్ము ప్రవీణ్ మాట్లాడుతూ ముచ్చోనిపల్లెలో పాఠశాల కోసం 20 గుంటల స్థలాన్ని కేటాయించారని, ప్రస్తుతం కొంతభాగంలో కొందరు ఆలయ నిర్మాణానికి యత్నిస్తున్నట్లు ఆరోపించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు మాచర్ల ప్రకాష్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు ప్రసాద్, దేవేందర్, సురేష్, అశోక్, కర్రెన్న, బల్గెర సునంద్ పాల్గొన్నారు.

ఇంటి పైకప్పు కూలి మహిళకు గాయాలు

ఉండవెల్లి: ఇంటి పైకప్పు కూలి మహిళకు గాయాలైన ఘటన మండలంలోని తక్కశీలలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. తక్కశీలకు చెందిన లక్ష్మీదేవి, ఆమె కుమారుడు, కోడలు ఇంట్లో ఉన్న సమయంలో పైకప్పు కూలింది. లక్ష్మీదేవిపై మట్టిదిబ్బలు పడడంతో గాయాలయ్యాయి. బాధిత మహిళను బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ పరామర్శించారు. బాధిత కుటుంబానికి డబుల్‌బెడ్రూం ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం నాయకులు మద్దిలేటి, రవి కోరారు.

రైతన్నపై 'కూలీ' భారం

- వర్షాలతో పొలాల్లోకి వెళ్లని ట్రాక్టర్లు
- కూలీలకు పెరిగిన డిమాండ్
- అన్నదాతలకు తడిసి మోపెడవుతున్న పెట్టుబడి
- కౌలురైతుల పరిస్థితి మరీ దారుణం



ఉండవెల్లిలో మొక్కజొన్న పంటలో..



కంచుపాడులో పత్తిపంటలో కలుపు తీస్తున్న రైతు

ఉండవెల్లి: చారణ కోడికి భారణ మసాలా అన్నట్లుగా తయారైంది రైతుల పరిస్థితి. వ్యవసాయం చేయాలంటే రైతులు భయపడేలా అన్ని రకాల రేట్లు పెరుగుతున్నాయి. కూలీల రేట్లు, ట్రాక్టర్, ఎరువులు, మందులు తదితర ఖర్చులు రైతులపై పెనుభారంగా మారాయి. రైతులు వేలాది రూపాయల పెట్టుబడి పెట్టి ఆరుగాలం కష్టపడినా పంట చేతికొచ్చే వరకు నమ్మకం లేదు. ఇలాంటి తరుణంలో ఈ ఏడాది వ్యవసాయ కూలీల రేట్లు అధికం కావడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో పంట పొలాల్లోకి యంత్రాలు రాలేని పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు కూలీలను ఆశ్రయిస్తున్నారు. ఎకరం పొలంలో పత్తి, మొక్కజొన్న, మిరప విత్తనాలు వేయాలంటే గతంలో ఒక్కో కూలీకి రూ.300 నుంచి రూ.400 వరకు ఇచ్చేవారు. ప్రస్తుతం రూ.500 వరకు కూలీలు డిమాండ్ చేస్తున్నారు. క్రిమిసంహారక మందుల పిచికారీకి రూ.500 నుంచి రూ.800 వరకు చెల్లిస్తున్నారు. ఎద్దుల గడాలతో కలుపు పాయడానికి రూ.1800 నుంచి రూ.2వేల వరకు ఖర్చవుతుందని రైతులు పేర్కొంటున్నారు. ఇలా కూలీల ఖర్చు, గడాల ఖర్చు, మందుల పిచికారీకి తడిసి మోపెడవుతోందని రైతులు వాపోతున్నారు.

కౌలు రైతుల సతమతం..

కౌలు రైతుల పరిస్థితి మరీ దారుణంగా మారింది. ఎకరా పొలం కౌలుకు రూ.10వేల నుంచి రూ.15వేల వరకు పలుకుతోంది. భూమి కౌలు, విత్తనాలు, ఎరువుల కొనుగోలు, ట్రాక్టర్ల కిరాయి, కూలీల ఖర్చు, కలుపు నివారణ మందులు ఇలా అనేక రకమైన ఖర్చులతో కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే.. పంట చేతికొచ్చే వరకు ఎంత ఖర్చు అవుతుందో తెలియక సతమతమవుతున్నారు.

వర్షంతో కలుపు అధికమైంది..



రెండెకరాల్లో పత్తి, మొక్కజొన్న వేశాను. ఇటీవల కురిసిన వర్షాలకు పంటచేనులో కలుపు అధికమైంది. కలుపు తీయడానికి ఖర్చులు ఎక్కువయ్యాయి. వానాకాలం ప్రారంభంలో వర్షాలు లేక నష్టపోగా, ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో పత్తిపంట ఎర్రబారింది.

– మహేందర్, రైతు, కంచుపాడు

అప్పులు తప్పడంలేదు..



ఎకరా పొలం రూ.14వేలకు కౌలుకు తీసుకొని మిర్చిసాగు చేశాను. విత్తనం వేయడానికి రూ.2వేలు ఖర్చయ్యింది. ఇటీవల కురిసిన వర్షాలతో నారా కుళ్లిపోతుంది. మరో ఎకరా పొలంలో ఉల్లి విత్తనాలు వేస్తే పంట పండలేదు. పంట సాగుకు అప్పులు తప్పడంలేదు.

– అంజనేయులు, రైతు, ఉండవెల్లి

దోమల వ్యాప్తిని నివారిద్దాం



అయిజలో ఆయిల్‌బాల్స్ వేయిస్తున్న మున్సిపల్ కమిషనర్ నర్సయ్య

అయిజ: దోమల వ్యాప్తితో ప్రజలు అనేక వ్యాధులకు గురవుతారని, దోమల వృద్ధిని అరికట్టాలని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య అన్నారు. మున్సిపాలిటీలోని వివిధ కాలనీల్లో మంగళవారం కమిషనర్ పర్యటించారు. ఈ సందర్భంగా సిబ్బందిచే మురుగు కుంటల్లో ఆయిల్‌బాల్స్ వేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇళ్ల మధ్య నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇంజినీర్ సురేష్, జవాన్లు సురేందర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

అలంపూర్ రూరల్: దోమల నివారణకు మండలంలోని పలు గ్రామాల్లో ఫాగింగ్ చేయిస్తున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపడుతున్నట్లు సర్పంచులు తెలిపారు.

ప్రభుత్వ నిర్ణయాలు సంచలనం



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

అలంపూర్: ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు సంచలనమని ఎమ్మెల్యే వీఎం అబ్రహం అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో 43,373 మంది ప్రభుత్వ ఉద్యోగులుగా మారారన్నారు. 1932లో నిజాం కాలంలో ఆర్టీసీ ప్రస్థానం ప్రారంభం కాగా, 1951లో హైదరాబాద్ సంస్థానంలో విలీనమైందన్నారు. ఆ తర్వాత 1958లో ఏపీ ఆర్టీసీ సంస్థగా మారిందన్నారు. అప్పట్లో ఏపీ ఆర్టీసీ గిన్నీస్‌బుక్‌లో స్థానం సంపాదించుకుందన్నారు. టీఎస్ ఆర్టీసీగా మారిన తర్వాత ఇప్పుడు ప్రభుత్వంలో భాగస్వామ్యంగా మారడం సంతోషకరమన్నారు. అనాథ పిల్లల కోసం తీసుకున్న నిర్ణయంతో వారి భవిష్యత్తుకు పునాదులు పడ్డాయన్నారు. మహా మెట్రోకు రూ.69,100 కోట్లు కేటాయించడం హర్షణీయమన్నారు. రాష్ట్రంలో వరద బాధితుల సహాయార్థం రూ.500కోట్ల ఆర్థిక సాయం ప్రకటించినట్లు తెలిపారు. పేదల ఆరోగ్యానికి హైబ్రిడ్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు నిర్మిస్తున్నట్లు చెప్పారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు.

ప్రతి కుటుంబానికి భరోసా

రాజోళి: ప్రతి కుటుంబానికి ముఖ్యమంత్రి కేసీఆర్ భరోసాగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం 63మందికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం పెద్దతాండ్రపాడుకు చెందిన 60మందికి ఇంటి స్థలాలకు సంబంధించిన పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డల పెళ్లికి తల్లిదండ్రులు ఇబ్బందులు పడొద్దని ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలతో రూ.లక్షా 116 అందిస్తున్నట్లు తెలిపారు. పేదల సంక్షేమానికి దేశంలో ఎక్కడా లేని పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. జెడ్పీటీసీ సుగుణమ్మ, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు నిషాక్, ఎంపీటీసీ శేషావళి, తహసీల్దార్ జోషి శ్రీనివాస్‌శర్మ, రషీద్ పాల్గొన్నారు.

శిశువులకు తల్లిపాలే అమృతం: కలెక్టర్

గద్వాల రూరల్: తల్లిపాలే చంటిబిడ్డలకు అమృతమని.. ప్రతి తల్లి తమ పిల్లలకు తప్పకుండా పాలివ్వాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. మంగళవారం మాత, శిశుసంక్షేమశాఖ, వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీ వరకు కొనసాగే తల్లిపాల వారోత్సవాల పోస్టర్లను తన చాంబర్‌లో ఆవిష్కరించి మాట్లాడారు. తల్లిపాల ఆవశ్యకత, ఇవ్వకపోతే కలిగే అనర్థాలను మాతృమూర్తులకు వివరించాలన్నారు. డీఎంహెచ్‌ఓ డా. శశికళ, మాత, శిశుసంక్షేమశాఖ అధికారి ముషాయిదాబేగం తదితరులు పాల్గొన్నారు.

- దివ్యాంగుడికి చేయూత.. కేటీదొడ్డి మండలం గంగన్‌పల్లికి చెందిన దివ్యాంగుడు నవీన్‌కుమార్‌కు కలెక్టర్ ఉచితంగా వీల్‌చైర్ అందించారు.

అలంపూర్ రూరల్: తల్లి పాలు బిడ్డకు అమృతం లాంటిదని ఐసీడీఎస్ సీడీపీఓ సుజాత అన్నారు. పట్టణంలోని 2వ అంగన్‌వాడీ కేంద్రంలోతల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ బిడ్డ పుట్టగానే ముర్రుపాలు ఇవ్వాలని సూచించారు. తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, ఎమేలమ్మ, శాంతమ్మ, నర్మద, మాధవి, భారతి, లక్ష్మీకాంతమ్మ, రూపప్రియ, సావిత్రి, వరలక్ష్మి పాల్గొన్నారు.

యాపదిన్నెలో ప్రత్యేక పూజలు



అయిజ: అధిక శ్రావణమాసం పౌర్ణమిని పురస్కరించుకొని మండలంలోని యాపదిన్నె చెన్నకేశవ స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నకేశవస్వామి, ఆంజనేయస్వామి, మహాశివుడికి పంచామృత అభిషేకం, అర్చనలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి.

అవమానాలు భరించలేకే బీఆర్‌ఎస్‌ను వీడా

- జెడ్పీ చైర్‌పర్సన్ సరిత



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సరిత

గద్వాల అర్బన్: నాలుగేళ్ల పాటు అధికార బీఆర్‌ఎస్ పార్టీలో ఉండి స్థానిక నాయకులతో అనేక అవమానాలు ఎదుర్కొని మనస్థాపానికి గురై చివరకు కాంగ్రెస్‌పార్టీలో చేరారని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత తెలిపారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని ఓ బాంక్వెట్ హాల్‌లో నిర్వహించిన విలేకరుల ఆత్మీయ సమ్మేళనానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనేక సమావేశాలకు స్థానిక నాయకులు దూరంగా ఉంచారని ఆవేదన వ్యక్తం చేశారు. బడుగు, బలహీన వర్గాల నుంచి తాను ప్రశ్నిస్తున్నానని, బలహీనవర్గాలకు రాజ్యాధికారం రావాలనే తపనతో రాజకీయాల్లోకి వచ్చినట్లు వివరించారు. తనను ఆశీర్వదిస్తే బలహీనవర్గాల అభ్యున్నతి, జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కొరకు అహర్నిశలు కృషి చేస్తానన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సత్యనారాయణ, కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

హోంగార్డులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

గద్వాల క్రైం: హోంగార్డులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ మంగళవారం ఎస్పీ సృజనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హోంగార్డులకు ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు మృతి చెందిన వారి కుటుంబసభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, రిటైర్మెంట్ వయస్సు 65ఏళ్లకు పెంచాలని, డబుల్‌బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. చిన్నపాటి తప్పిదాలకు తొలగించిన సిబ్బందిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ, శ్రీనివాసులు, రమేష్, అనంతరెడ్డి పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరి



షక్‌పల్లిలో టీకాలు వేస్తున్న వెటర్నరీ సిబ్బంది



శాంతినగర్ మండలం కొంకలలో..

శాంతినగర్: వర్షాకాలంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని వెటర్నరీ డాక్టర్ పుష్పలత సూచించారు. వడ్డేపల్లి మండలంలోని కొంకల, బుడమర్సు గ్రామాల్లో మంగళవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ సీజనల్‌గా వచ్చే గాలికుంటు వ్యాధితో పశువులు నడవలేని స్థితికి చేరుకుంటాయని, వ్యాధి నివారణ టీకాలు వేయించి పశుసంపదను కాపాడుకోవాలని సూచించారు. మొత్తం 110 గేదెలు, 50 ఆవులు, ఎద్దులకు టీకాలు వేసినట్లు పేర్కొన్నారు. లేగదూడలకు నట్టల నివారణ మందులు తాగించినట్లు తెలిపారు. పశు వ్యాధి నిర్ధారణ కేంద్రం డాక్టర్ కరుణశ్రీ కొంకలలో పశువుల నుంచి రక్తనమూనాలు సేకరించారు. కార్యక్రమంలో వీఎల్‌ఓ వరప్రసాద్, షేక్ లతీఫ్, రవి, వెంకటమ్మ, కృష్ణ, గోపాలమిత్రలు విద్యాసాగర్, లక్ష్మన్న, నారాయణగౌడ్ పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలం షేక్‌పల్లిలో పశువులకు టీకాలు వేసే కార్యక్రమాన్ని ఎంపీపీ స్నేహ ప్రారంభించారు. అన్ని గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం జరుగుతుందని, పశువుల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి భువనేశ్వరి కోరారు. కార్యక్రమంలో సిబ్బంది సబీనా, శ్రీరాములు, రాజేంద్ర పాల్గొన్నారు.

అయిజ: పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణ కోసం ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న టీకాలను సద్వినియోగం చేసుకోవాలని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపరాణి కోరారు. మండలంలోని యాపదిన్నె, పులికల్ గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు.

రాగిపిండి, బెల్లం ప్యాకెట్లు పంపిణీ



ధరూరులో హెచ్‌ఎంలకు రాగి జావ పిండి, బెల్లం ప్యాకెట్లను అందజేస్తున్న ఎంఈఓ

ధరూరు: పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతోపాటు బెల్లంతో కూడిన రాగిజావ అందించనున్న నేపథ్యంలో మంగళవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో హెచ్‌ఎంలకు రాగి పిండి, బెల్లం ప్యాకెట్లను ఎంఈఓ సురేష్ పంపిణీ చేశారు. అదేవిధంగా వంట ఏజెన్సీలకు చీరలను అందజేశారు. విద్యార్థులకు రుచికరంగా రాగిజావ అందించేవిధంగా చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎంలకు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

కేటీదొడ్డి: మండలంలోని పాఠశాలల ఉపాధ్యాయులకు ఎంఈఓ సురేష్ రాగిపిండి, బెల్లం ప్యాకెట్లను పంపిణీ చేశారు. అనంతరం వంట ఏజెన్సీలకు చీరలను అందజేశారు. కార్యక్రమంలో సీఆర్పీలు యుగంధర్, పాపయ్య, శ్రీను, విజయలక్ష్మి, ఉపాధ్యాయులు మహేశ్వర్, నవీన్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

అలంపూర్ రూరల్: పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని, ప్రతి ఒక్కరూ పోషకాలు కలిగిన ఆహార తీసుకోవాలని మండల వైద్యాధికారి ప్రసూణరాణి సూచించారు. ఆరోగ్య మహిళా కార్యక్రమంలో భాగంగా క్యాతూర్ పీహెచ్‌సీలో మంగళవారం మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాలీశ్వరయ్య పాల్గొన్నారు.

మానవపాడు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో డాక్టర్ రిజ్వానా తన్వీర్ మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. రక్తహీనత, బీపీ, షుగర్ తదితర వాటితో బాధపడుతున్న వారికి మందులను అందజేశారు. కార్యక్రమంలో చంద్రన్న, సంధ్యారాణి, మధుమోహన్, తిరుమలరావు, సోని, ప్రసన్న, షాజహాన్, రేవతి, రాణి, అనసూయమ్మ, ప్రసన్న పాల్గొన్నారు.

మౌలాలిస్వామి నిమజ్జనం

మానవపాడు: మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో కొలువుదీరిన మౌలాలిస్వామి పీరును మంగళవారం ఊరేగించి నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో దామోదర్‌రెడ్డి, వెంకట్రాములు, చాంద్, స్వామి, బాషా, షాకీర్ పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి

అలంపూర్: వసతిగృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలోని ఎస్సీ వసతిగృహాల సమస్యలపై కేవీపీఎస్ మండల కమిటీ అధ్వర్యంలో మంగళవారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతిగృహాల్లో అనేక సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎస్సీ బాలుర వసతిగృహం విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలను సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. గదుల్లోకి వర్షపునీరు చేరుతుందని, తాగునీటి సౌకర్యం లేదని తెలిపారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాగరాజు, ఆశన్న పాల్గొన్నారు.

సమష్టిగా ముందుకెళ్దాం

గద్వాల అర్బన్: పద్మశాలీలు రాజకీయాల్లో రాణించాలంటే కలిసికట్టుగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని అఖిలభారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి అన్నారు. అలంపూర్ నుంచి మంగళవారం చేపట్టిన రాజకీయ చైతన్య యాత్ర జిల్లా కేంద్రానికి చేరింది. ఈ సందర్భంగా మార్కండేయ స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేత కార్మికులకు మెరుగైన ఉపాధి లేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ప్రభుత్వం చేనేత కార్మికులను అన్నివిధాలా ఆదుకోవాలన్నారు. పద్మశాలీలకు రాజకీయ గుర్తింపునిచ్చి చట్టసభల్లో మాట్లాడానికి అవకాశం కల్పించాలన్నారు. పద్మశాలీలను ఏక చేసేందుకు సెప్టెంబర్ 3న హైదరాబాద్‌లోని నారాయణగూడలో రాజకీయ శంఖారావం బహిరంగసభ నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మచ్చ ప్రభాకర్, జగన్నాథం, రామచంద్రయ్య, రూప, దుశ్యంతల, రమేష్, సత్యం, వెంకటేష్, శ్రీకాంత్ ఉన్నారు.

బీచుపల్లి ఆలయంలో హైకోర్టు న్యాయమూర్తి



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలం బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయాన్ని మంగళవారం హైకోర్టు న్యాయమూర్తి రామ్మోహన్‌రావు దర్శించుకున్నారు. అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అర్చకుడు సందీప్‌చారి ఆలయ విశిష్టతను వివరించి శేష వస్త్రాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఆయన వెంట ఆలయ ఈఓ రామన్‌గౌడ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఫెడరేషన్ ఏర్పాటు చేయాలి

కేటీదొడ్డి: రాష్ట్రంలో అత్యధికంగా జనాభా కలిగిన గద్వాల నియోజకవర్గ వాల్మీకి బోయలకు ప్రత్యేక ఫెడరేషన్ ఏర్పాటు చేయాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి సమన్వయకర్త అంజి అన్నారు. ఈ మేరకు నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు మంగళవారం తహసీల్దార్ సుందర్‌రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకి బోయలకు ప్రత్యేక ఫెడరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో భీమన్నగౌడ్, ఉరుకుందు, ఉలిగెప్ప, సుభాన్, దస్తగిరిగౌడ్ పాల్గొన్నారు.

104 మంది చిన్నారుల గుర్తింపు

గద్వాల క్రైం: జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్ విజయవంతంగా ముగిసిందని ఎస్పీ సృజన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 104 మంది చిన్నారులను గుర్తించామని.. వారికి విముక్తి కల్పించి పాఠశాలలో చేర్పించినట్లు పేర్కొన్నారు. బాలలతో పనులు చేయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ధరూరు: జెన్‌కో డీఏవీ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం యాదవరెడ్డి తెలిపారు. గతనెల 31న నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థులు వినూత్న, లావణ్య, అక్షయ్‌కుమార్, అశోక్, ప్రహర్ష, అనూష, శ్రీహర్షారెడ్డి, వైష్ణవి ప్రతిభకనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. విద్యార్థులను జెన్‌కో ఎస్‌ఈ రామసుబ్బారెడ్డి, ఏఆర్‌ఓ జీఆర్‌కే ప్రసాద్ అభినందించారు.

ఆయిల్‌పాంతో లాభాలు



ఆయిల్‌పాం పంటను పరిశీలిస్తున్న అధికారులు

ధరూరు: ఆయిల్‌పాం సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని టీఎస్ ఆయిల్‌ఫెడ్ డిప్యూటీ మేనేజర్ వెంకటేష్, వ్యవసాయశాఖ అధికారిణి శ్రీలత అన్నారు. మండల కేంద్రం సమీపంలో రైతు మదిలేటి సాగు చేసిన ఆయిల్‌పాం తోటను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నెట్టెంపాడు, మన్నాపురం, ధరూరు, పారుచర్ల గ్రామాల రైతులకు అవగాహన కల్పించారు. ఆయిల్‌పాం సాగును ప్రభుత్వం అన్నివిధాలా ప్రోత్సహిస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు 5వేల ఎకరాల పైచిలుకు సాగు చేసినట్లు తెలిపారు.కార్యక్రమంలో ఆయిల్‌పాం ఫీల్డ్ ఆఫీసర్ శివకుమార్ పాల్గొన్నారు.

పత్తిపంట సాగుపై అవగాహన ఉండాలి

మల్దకల్: పత్తిపంట సాగుపై రైతులకు అవగాహన ఉండాలని డీఏఓ గోవిందనాయక్ సూచించారు. మంగళవారం మండలంలోని ఉలిగేపల్లిలో పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ రైతులు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించి అధిక దిగుబడులను సాధించాలని సూచించారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ ఎరువులను వినియోగించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రంగా ప్రకటించాలి



అయిజ: మేడికొండ గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. మేడికొండను మండలం చేయాలని మంగళవారం అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని అర్హతలు ఉన్న మేడికొండను మండలం చేయాలని కోరారు. మండల సాధన సమితి నాయకులు తిమ్మప్ప, దేవప్ప, రాముడు, రామకృష్ణ, బీచుపల్లి పాల్గొన్నారు.

కనులపండువగా లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణం



గద్వాలలో లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణం

గద్వాల: నది అగ్రహారంలో కల్యాణలక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని మంగళవారం కనులపండువగా నిర్వహించారు. అధిక శ్రావణమాస పౌర్ణమిని పురస్కరించుకుని సంప్రదాయబద్ధంగా దేవతామూర్తులను ప్రత్యేకంగా అలంకరించి మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛారణల మధ్య కల్యాణం జరిపించారు. కల్యాణ వేడుకను తిలకించడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా గోవింద నామస్మరణ మార్మోగింది.

మల్దకల్: ఆదిశిలా క్షేత్రంలో స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు బాజాభజంత్రీలతో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో అరవిందరావు, అర్చకులు మధుసూదనాచారి, రమేషాచారి, రవిచారి, నాగరాజుశర్మ, చంద్రశేఖర్‌రావు, ధీరేంద్ర దాసు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలం కొండేరుకు చెందిన చాకలి మహేష్ భార్య లక్ష్మి అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ మాజీ ఇంచార్జ్ శ్రీనాథ్, పోతురాజు శంకరమ్మ సేవాదళం నిర్వాహకుడు సోమనాద్రి మంగళవారం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు

ఎస్టీ జాబితాలో చేర్చాలి

అలంపూర్: వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ కోరారు. అలంపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వీఎం అబ్రహంకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో వడ్డెర కులస్తుల స్థితిగతులను చర్చించాలని కోరారు. కార్యక్రమంలో దస్తగిరి, వెంకట్రాములు, తిక్కయ్య, శ్రీనివాసులు, రాజు, స్వాములు, వెంకటేష్, హన్మంతు, కృష్ణయ్య, రామాంజనేయులు, అల్లీబాబు, యాదయ్య, రేవంత్‌కుమార్, పరుశరాముడు, గజ్జలన్న పాల్గొన్నారు.